క్లుప్తంగా

నీటి సమస్యకు పరిష్కారం


బోరుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో బోర్ మరమ్మతుకు గురి కావడంతో మూడు రోజులుగా పలు కానీలకు నీరందక స్థానికులు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన సర్పంచ్ భీమ, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర శనివారం బోరుకు మరమ్మతు చేయించి సమస్యకు పరిష్కారం చూపారు.

ఘనంగా ఇమాం కాశిం ఉరుసు

కృష్ణగిరి : మండలంలోని పోతుగల్లు గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం ఇమాం కాశిం స్వామి ఉరుసును శనివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున అశ్వంపై గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి నైవేద్యం సమర్పించారు. అలాగే గ్రామంలోని గోకారయ్య దర్గా వద్ద గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం కిస్తీ వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

అక్రమ కట్టడాల తొలగింపు

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని మడ్డిగేరిలో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నందున శనివారం గ్రామ పంచాయతీ ఈఓ నరసింహులు కాలనీలో పర్యటించారు. కాలువను ఆక్రమించుకుని కొందరు నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పత్తికొండ రూరల్ : నవోదయం 2.0 లో భాగంగా శనివారం పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వర రావు, ఎస్ఐ సాయిప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని మద్రిమాన్ తండా గ్రామంలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. అనంతరం వారు గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో సారా తయారీ మానుకోవాలని సూచించారు. నాటుసారా తయారీ నేరమని, విక్రేతలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడ్జెట్‌తో బాబు మోసం


ఎస్కే గిరి

హొళగుంద: రాష్ట్ర బడ్జెట్‌లో మరోసారి చంద్రబాబు మోసం బట్టబయలైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లోని మహిళలకు ఉచిత బస్సు, మహాశక్తి నిధి, నిరోద్యోగ భృతి హామీల ఊసే లేదన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు అవసరమైన దాని కన్నా తక్కువగా నిధులు కేటాయించడంలో కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

పెరిగిన హుండీ ఆదాయం


హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మగుండం హుండీ ఆదాయం గతేడాది కంటే రూ.69వేలు అదనంగా సమకూరినట్లు దేవదాయ, ధర్మాదాయ శాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ టి.హనుమంతరావ్, ఈఓ అంజనేయులు తెలిపారు. శనివారం ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని నాలుగు రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మేశ్వరస్వామి, అమ్మవారి హుండీలు, టెంకాయల వేలం, అంగళ్లు, సేవా టికెట్ల ఆదాయం మొత్తంగా రూ.5,51,509 లభించినట్లు తెలిపారు.

జొన్న దిగుబడి నమూనాల సేకరణ


జొన్న దిగుబడిని పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి: మండలంలోని మల్లెపల్లె గ్రామంలో సేంద్రియ ఎరువులు, మేలైన వ్యవసాయ పద్ధతులతో(జీఏపీ) సాగు చేసిన జొన్న పంట దిగుబడులను నాణ్యత ప్రమాణాల పరిశీలన నిమిత్తం శనివారం ఏపీఎస్ఓపీసీఏ (ఏపీ ఆర్గానిక్ ప్రొడక్షన్ అక్రిడియేషన్) అధికారులు సేకరించారు. గుంటూరు ఇవాల్యుయేటర్ డాక్టర్ మూల ప్రతాప్ రెడ్డి, స్థానిక ఏఓ అక్బర్‌బాషా, ఆర్గనైజేషన్ కర్నూలు ఇన్‌స్పెక్టర్ చైతన్య సాగర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పొలం బడి నిర్వహించి రైతులతో మాట్లాడారు. అనంతరం పట్టణంలోని ఎఫ్‌పీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో జీఏపీ పద్ధతిలో శ్రీరంగాపురంలో సాగు చేసిన కొర్ర పంట నమూనాల్లో పురుగు మందుల అవశేషాలు లేవని క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్కోప్ సర్టిఫికెట్ జారీ చేసిందని అభినందించారు. ఏఈఓ అజయ్ కుమార్, ఎఫ్‌పీఓ సీఈఓ శివశంకర్, ఆర్ఎస్‌కె సిబ్బంది అనిల్ ఉన్నారు.

అన్నదాతల్లో 'గుర్తింపు' ఆందోళన

- ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- భూములున్న వారు విధిగా నమోదు చేయించుకోవాలని ఆదేశం
- వేధిస్తున్న సర్వర్
- పనులు లేక వలసబాటలో రైతన్నలు
- కౌలు రైతుల గురించి ప్రస్తావించని సర్కారు


పగిడిరాయిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

తుగ్గలి : అన్నదాతలను కూటమి ప్రభుత్వం టెన్షన్ పెడుతోంది. ప్రతి రైతూ 11 అంకెల గుర్తింపు కార్డు తీసుకోవాలంటూ కొత్త మెలిక పెట్టింది. ఈనెలాఖరు లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఒత్తిళ్లు ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.సొంత భూములున్న రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కౌలు రైతుల మాట ఎక్కడా ప్రస్తావించక పోవడం విమర్శలకు తావిస్తోంది. రైతు గుర్తింపు కార్డు ఉంటేనే బ్యాంకు రుణాలు, సబ్సిడీలు రావాలన్నా, పీఎం కిసాన్, పెట్టుబడి సాయం తదితర వ్యవసాయ పథకాలు అందాలన్నా గుర్తింపు కార్డు ప్రామాణికంగా చెబుతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా వ్యవసాయ సిబ్బంది రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదులో బిజీగా ఉన్నారు. ఇప్పటి వరకు 50 శాతం మంది కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. సర్వర్ పనిచేయక, రైతులు అందుబాటులో లేక నమోదు ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీంతో పలు గ్రామాల్లో ఆర్ఎస్‌కేల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

వలస బాటలో రైతులు..

ఈ ఏడాది ఖరీఫ్, రబీలో సాగుచేసిన పంటలు వాతావరణం అనుకూలించక, తెగుళ్లతో దిగుబడులు పూర్తిగా పడిపోయాయి. పెట్టుబడులు చేతికి రాక, పండిన కాసింత పంట ధరల్లేక అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోయారు. కుటుంబ పోషణ కోసం పిల్లాపాపలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వారంతా ఇంకా నెల వరకు వచ్చే అవకాశం లేదు. రిజిస్ట్రేషన్ గడువు ఎక్కడ ముగుస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కార్డు లేకుంటే ..

రైతు గుర్తింపు కార్డు ద్వారా పంట రుణాలు, సబ్సిడీలు, వడ్డీ రాయితీ, వ్యవసాయ యంత్ర పరికరాలు, పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం, వైపరీత్యాల సమయంలో అందే పరిహారం వంటివి అందనున్నాయి. కార్డు లేకుంటే ఇవన్నీ ఆగిపోతాయని ప్రభుత్వం పేర్కొంటోంది.

మండలాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ వివరాలు..

మండలం	రైతులు	రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు
పత్తికొండ	15,195	4,823
మద్దికెర	9,786	3,924
తుగ్గలి	17,195	8,171
కృష్ణగిరి	20,881	7,444
వెల్దుర్తి	16,538	4,691

ఆందోళన అవసరం లేదు

రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదులో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈనెలాఖరులో 50 శాతం రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పాం. వచ్చేనెల వరకు నమోదు గడువు ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పూర్తి వివరాలతో రైతులు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రస్తుతం సొంత భూములున్న వారు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతులు ఆలస్యం చేయకుండా నమోదు చేయించుకోవాలి.

– మోహన్‌విజయ్‌కుమార్, ఏడీఏ, పత్తికొండ

శ్రీరంగనాథుడికి ప్రత్యేక పూజలు

మద్దికెర : మండలంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందెసేవ, అభిషేకం, అష్టోత్తరనామార్చన, మహామంగళ హారతి అనంతరం శ్రీరంగనాథుడు శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు. పూజలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

ఆలూరు రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్డీ ప్రభాకర్ సూచించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తడి,పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో మరుగుదొడ్డి నిర్మించుకుని ఉపయోగించుకోవాలన్నారు. నీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలన్నారు.

మారెమ్మవ్వ ఆలయంలో చోరీ

ఆస్పరి: స్థానిక మారెమ్మవ్వ ఆలయంలో ఈనెల 20వ తేదీన చోరీ జరిగిన విషయం శనివారం సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆలయ పూజారి గోవిందు తెలిపారు. ఆలయంలో మారెమ్మవ్వకు చెందిన రెండు తులాలు బంగారు మంగళ సూత్రం, హుండీలోని కానుకలను దుండగులు అపహరించుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయాన్ని సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

ముగిసిన బ్రహ్మగుండం ఉత్సవాలు


గంగా, గౌరీ సమేత బ్రహ్మేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: బ్రహ్మగుండంలో శివరాత్రి ఉత్సవాలు శనివారం నిర్వహించిన వసంతోత్సవం, గ్రామోత్సవంతో ముగిశాయి. ఆలయ అర్చకులు నాగరాజు, శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మేశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవారు సర్వాభరణాల ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేకాలంకరణ గావించిన గంగా, గౌరీదేవి సమేత బ్రహ్మేశ్వర స్వామి ఉత్సవమూర్తులను భక్తులు, ఆయకట్టుదారులు ఎద్దుల బండిపై ఆశీనులు గావించి మేళతాళాల మధ్య ఆలయ ప్రాకారం చుట్టూ తిప్పుతూ రంగులనీళ్లు చల్లుతూ వసంతోత్సవం జరిపారు. సాయంత్రం వెల్దుర్తి పురవీధుల్లో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

సత్తా చాటిన గార్లదిన్నె వృషభాలు


పోటీలను ప్రారంభిస్తున్న రమాకాంత్ రెడ్డి

వెల్దుర్తి: బ్రహ్మగుండంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సీనియర్ కేటగిరి వృషభాలకు నిర్వహించిన బండలాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులు వృషభాలు విజేతలుగా నిలిచి రూ.50వేలు గెలుచుకోగా, అదే గ్రామానికి చెందిన కె.రమేశ్ ఎద్దులు రెండవ స్థానంలో నిలిచి రూ.40వేలు సొంతం చేసుకున్నాయి. నిర్వాహకుడు బొమ్మన రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పోటీలను బొమ్మన రమాకాంత్ రెడ్డి, బలరాంగౌడ్, సుధాకర్ గౌడ్, ప్రథమ బహుమతి దాత ఉలిందకొండ రమణతో కలిసి ప్రారంభించారు. ఆ తరువాత మూడో స్థానంలో ప్యాపిలి పీఆర్ పల్లె శ్రీరాములు యాదవ్, గార్లదిన్నె కృష్ణాపురం రామచంద్రారెడ్డి వృషభాలు సంయుక్తంగా, నాల్గవ స్థానంలో అనంతపురం సోములదొడ్డి రామ సుబ్బారెడ్డి ఎద్దులు, ఐదవ స్థానంలో కోడుమూరు కొత్తపల్లె దుబ్బన్న వృషభాలు నిలిచి వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు గెలుచుకున్నాయి. రామచంద్రుడు, గుంటుపల్లె వెంకట్రాముడు, మల్లెపల్లె మురళి పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం


ఆలూరులోని మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


ఆస్పరిలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ఆలూరులో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష రాశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 21 గదుల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 469 మంది ఫస్టియర్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 459 మంది హాజరయ్యారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్ సెంటర్ చీఫ్‌లు కృపాకర్, రాఘవరావు వెల్లడించారు. ఎగ్జామ్స్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. గదుల్లో సీసీ కెమెరాలు, తాగునీరు, డెస్కులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

- ఆస్పరి: మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా, మోడల్ స్కూల్ నుంచి మొత్తం 172 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 170 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహులు తెలిపారు.
- చిప్పగిరి:ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు స్థానిక జూనియర్ కాలేజీలో శనివారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు మొత్తం 70 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 64 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

11 మంది గైర్హాజరు

మద్దికెర : స్థానిక ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సవిత, డిపార్ట్‌మెంటల్ అధికారి కిరణ్మయి శనివారం తెలిపారు. పరీక్షలకు మొత్తం 212 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 201 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

- హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం ప్రారంభమైన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 117 మంది విద్యార్థులకు గాను 115 మంది పరీక్షలకు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు, కన్నడ, హిందీ పరీక్షలు జరిగాయి. ట్రైనీ ఎస్ఐ మహబూబ్‌బాషా, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బాబు, చీఫ్‌గా ప్రిన్సిపాల్ ప్రవీణ వ్యవహరించారు.
- పత్తికొండ రూరల్ : పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు రాసేందుకు విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 599 మందికి గాను 33 మంది గైర్హాజరయ్యారని పరీక్షల అధికారులు తెలిపారు.
- వెల్దుర్తి: ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో మొదటి రోజు తెలుగు, హిందీ సబ్జెక్టును 209 మంది విద్యార్థులు రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మల్లికార్జున తెలిపారు. ముగ్గురు గైర్హాజరైనట్లు చెప్పారు.
- కృష్ణగిరి: ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంలో నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 259 మంది రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు సీఎస్ షంషున్నీసా బేగం తెలిపారు. పరీక్షలను సిట్టింగ్ స్క్వాడ్ రమేశ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లాల్‌బాషా తనిఖీ చేశారు.

భూసమస్యలకు తక్షణ పరిష్కారం చూపండి


తహసీల్దార్లు, డీటీలతో మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

పత్తికొండ రూరల్ : భూసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ తహసీల్దార్లకు సూచించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మ్యూటేషన్ లేకుండా రైతుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో మార్చితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నోటీస్ బోర్డు

దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలూరు మండల స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ ఈరేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తిచేసిన యువతీ యువకులు శిక్షణకు అర్హులన్నారు, ఆసక్తిగల వారు ఈనెల 4న మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సెల్: 9010003132 నంబరులో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

పత్తికొండ రూరల్ : 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ బాలుర గురుకులంలో 5,6,7,8 వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పత్తికొండ ఏపీ బాలుర గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.రామాంజనేయులు శనివారం తెలిపారు. ఈనె 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువుందని పేర్కొన్నారు.

రథోత్సవానికి ఏర్పాట్లు

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో ఈనెల 4వ తేదీన గాదిలింగేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా గ్రామంలోని రోడ్లను చదును చేయిస్తున్నట్లు సర్పంచ్ ఉలిగమ్మ తెలిపారు. శనివారం లింకు రోడ్లపై గరుసు వేసి చదును చేయించారు. సుశువాయి, విరుపాపురం, సిద్ధాపురం, అమృతాపురం, బల్లూరు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వైపు ఉన్న మట్టి రహదారులపై గరుసు వేసి చదును చేయించినట్లు చెప్పారు.

పింఛన్ పంపిణీ


దేవనబండలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్

పత్తికొండ రూరల్ : మండలంలోని దేవనబండ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ సచివాలయ అధికారులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. వీఆర్ఓ భాషా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామంలోని హజరత్ ఫరీద్‌వలి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయినికి సన్మానం


ఆర్.మంజులమ్మను సన్మానిస్తున్న దృశ్యం

ఆలూరు: స్థానిక ఉమాకల్యాణ మండపం ఆవరణలో పట్టణంలోని మెయిన్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయురాలు ఆర్.మంజులమ్మ పదవీ విరమణ సందర్భంగా శనివారం హెచ్‌ఎం.ఈరన్న ఆధ్వర్యంలో ఎంఈఓ కె.కోమలాదేవి, ఎంఈఓ–2 చిరంజీవిరెడ్డి తదితరులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో మండలంలో వివిధ జెడ్పీ హైస్కూళ్లు, ఎంపీపీ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు పీఎంసీ చైర్మన్లు ,ఎమ్మార్సీలు, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగరాజ్, యూటీఎఫ్ నాయకులు ఖాసీం పాల్గొన్నారు.

దేవనకొండలో సంచార వైద్యశాల

దేవనకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సంచార వైద్యశాలను శనివారం ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు ప్రజలకు వైద్యసేవలు అందించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ సంచార వైద్యశాలను ప్రతి నెలలో మొదటి శనివారం, మూడో బుధవారం ఏర్పాటు చేస్తామన్నారు.

పదేళ్లయినా నీటి సమస్య పరిష్కరించరా?


మండల అధికారులను నిలదీస్తున్న ప్రజలు

చిప్పగిరి: స్థానిక ఎస్సీ,బీసీ,కొండగేరి తదితర కాలనీల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు శనివారం మండల పరిషత్ కార్యాలయ అధికారులను శనివారం నిలదీశారు. కార్యాలయానికి వచ్చిన మహిళలు మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరెందుకని ప్రశ్నించారు. అనంతరం సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓ అల్లాబకాష్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. విచారించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

రంజాన్ నెల ప్రారంభం

- నేటి నుంచి నెల రోజుల పాటు ముస్లింల ఉపవాసాలు
- మొదలైన ప్రత్యేక తరావీహ్ నమాజులు
- వెల్దుర్తి జామియా మసీదులో ప్రతిరోజు సహేరి ఏర్పాటు


వెల్దుర్తి జామా మసీదులో శనివారం రాత్రి తరావీహ్ నమాజు చదువుతున్న ముస్లింలు

వెల్దుర్తి: ముస్లిముల పవిత్ర మాసం రంజాన్ నెల శనివారం సాయంత్రం నెలవంక దర్శనంతో ప్రారంభమైంది. దీంతో అన్ని మసీదులలో, ఇళ్లలో రాత్రి ఇషా నమాజ్ అనంతరం నెలరోజుల పాటు పవిత్ర గ్రంథ పఠనం జరిగే ప్రత్యేక తరావీహ్ నమాజులు ప్రారంభమయ్యాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉపవాసదీక్ష (రోజా) చేపట్టేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. నెల పాటు ప్రతిరోజు సూర్యోదయం ముందు ప్రారంభించి (సహేరీ– భోజనం చేసి ఉపవాసం ప్రారంభించడం) సూర్యాస్తమయం తరువాత విరమించేలా (ఇఫ్తార్ – ఉపవవాసం విరమించడం) ఏర్పాట్లు చేశారు. వెల్దుర్తి జామియా మసీదులో నెలరోజుల పాటు వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ మండల కన్వీనర్, సోషల్ మీడియా ప్రతినిధి గట్టు ఆరిఫ్, చికెన్ మౌలాలి ఆధ్వర్యంలో రోజూ వేకువ జామున గం.3.30 నుంచి 4.30 గంటల మధ్య సహేరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహేరీ హాజరుకు 8886461864, 9912484747 నంబర్లలో సంప్రదించాలని కోరారు. దీక్షా పరులు, మసీదుకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జామియా మసీదు కమిటీ ప్రతినిధులు ముల్లా ఖాజా, ఇబ్రహీం తెలిపారు.

ఎల్లార్తి హుండీ లెక్కింపు అడ్డగింత

- ఆదాయం తీసుకెళ్తున్నారే గానీ అభివృద్ధి ఎక్కడ అని గ్రామస్తుల నిలదీత


అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల హుండీల ఆదాయ లెక్కింపును శనివారం గ్రామస్తులు కొందరు అడ్డగించారు. దర్గాలోని ఓ చిన్న గదిలో వక్ఫ్‌బోర్డు అధికారులు ఆయా దర్గాలకు చెందిన నాలుగు హుండీలను తెరిచి నగదు, ఇతర కానుకలను లెక్కించేందుకు సిద్ధమయ్యారు. అయితే గ్రామానికి చెందిన చిదానంద, సర్దార్, ఎంపీటీసీ బసప్ప తదితరులు అడ్డుకుని పదేళ్ల నుంచి దర్గాల నుంచి రూ.కోట్లలో ఆదాయం తీసుకెళ్లారని, ఇక్కడ మాత్రం ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. దర్గాలో భక్తుల నిలువు దోపిడీ అధికమైందన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్, నెల్లూరు రాంతాబాద్ దర్గా ఈఓ షేక్ సయ్యాద్ హుసేన్, హొళగుంద ట్రైనీ ఎస్ఐ మహబూబ్‌బాషా తదితరులు కలుగజేసుకుని సమస్యను చైర్మన్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆదాయం దర్గాలకు వినియోగించేలా చూస్తామని హామీనివ్వడంతో వారు శాంతించారు. హుండీ లెక్కింపు చేపట్టగా.. 5 నెలలకు సంబంధించి రూ.7,72,650 నగదు, 78 తులాల వెండి గుర్రాలు లభించాయని వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్, నెల్లూరు దర్గా ఈఓ షేక్ సయ్యాద్ హుసేన్ తెలిపారు. సయ్యద్ రవూఫ్, గౌస్, మురాద్ అన్సారి, ఆదోని డివిజన్ వక్ఫ్‌బోర్డు ఆడిటర్ అండ్ ఇన్‌స్పెక్టర్ సుహేల్, ఈఓ ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాలో జరిగేది జగమెరిగిన సత్యం..

దర్గాలకు వచ్చే ఆదాయంతో ఎంతో అభివృద్ధి జరగాలి.. కానీ ఇక్కడ ఏమి జరుగుతుందో అందరికీ తెలుసని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్, నెల్లూరు దర్గా ఈఓ షేక్ సయ్యాద్ హుసేన్ తెలిపారు. దర్గాలో సుహేల్, ఈఓ ఇమ్రాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. హుండీ ఆదాయం ఏ విధంగా తగ్గుతుందో అందరికీ తెలుసన్నారు. అధికారులు దీన్ని కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నా అనేక రకాల ఒత్తిళ్లు వస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ఆదాయంలో రూ.56 లక్షలు ఉన్నాయని వాటితో పాటు ఇప్పుడు టెండర్ ద్వారా వచ్చే ఆదాయంతో దర్గాలలోని 38 గదుల మరమ్మతు, తాగునీటి వసతి ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య

మద్దికెర : కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య కేటాయించడానికి చర్యలు చేపట్టిందని అందులో భాగంగా రైతులు తమ భూములకు సంబంధించి వివరాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ రవి శనివారం తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.


తుపాకీ పనితీరుపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సతీష్ కుమార్

అప్రమత్తంగా ఉండాలి

చిప్పగిరి: విద్యార్థినులు,మహిళలు అప్రమత్తంగా ఉంటే అఘాయిత్యాల నుంచి రక్షణ పొందవచ్చని ఎస్ఐ సతీష్ కుమార్ అన్నారు. శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు పోలీస్ వ్యవస్థ, ఆయుధాల ప్రదర్శన, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధనకు శ్రమించాలని సూచించారు.